


# తీర్పు

దాదాపు దశాబ్దం తర్వాత విజయవాడలో గవర్నర్ పేటలోని హోటల్లో సోమసుందరం, దీక్షితులు కల్సుకున్నారు. కల్సుకుని చాలా కాలమవడంవల్ల, కాలం తెచ్చిన మార్పులవల్ల కాదేమోనని మీమాంస పడిపోయి చివరికి 'నువ్వేట్రా' అంటూ హాయిగా నవ్వుకున్నారు. ఏదో కొత్త వస్తువుని డిస్కవర్ చేసిన ఆనందం ఇద్దరిలోనూ కనిపించింది.

సోమసుందరం బిల్లు తానే చెల్లించాడు. యిద్దరూ బయటికి వచ్చారు. హోటలు రద్దీగా వుండటంవల్ల అక్కడ కూర్చోబుద్ధికాలేదు. కిళ్ళీబడ్డీదగ్గర దీక్షితులు అగ్గిపెట్టె కొని చుట్ట వెలిగించాడు. సోమసుందరానికి ఆఫర్ చేశాడు.

"లేదురా...మానేశాను..."

రైలింజనులా యిరవై నాలుగు గంటలూ చుట్టలు కాల్చిన సోమసుందరమేనా ... అని దీక్షితులు విస్మయంగా చూశాడు. ఒక వ్యసనానికి అలవాటుపడి దాన్ని మానెయ్యడం దీక్షితులుకి అబ్బురంగా తోచింది అతడెన్నోసార్లు

చుట్టలు మానెయ్యాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"మళ్ళీ వస్తారా ... రైలుకి టైం అవుతోంది."

"భలేవాడివిరా. యింత రాత్రిపడి పోతావా ? అదేం వీల్లేదు. చానాళ్ళకి కల్సుకున్నాం. ఈ రాత్రికి మాయింటిలో వుండాల్సిందే."

సోమసుందరం యిబ్బందిగా చూశాడు. ఇదేం పట్టించుకోకుండా దీక్షితులు దుర్గా అగ్రహారానికి రిక్షా మాట్లాడేశాడు. ఈ దశలో రానని చెప్పడం బాగోదని సోమసుందరం రిక్షా ఎక్కాడు.

"మీ వాడికి పెళ్ళి చేశావా ? రిటైరయ్యేలోగా అమ్మాయి పెళ్ళిచేద్దామని తెగ ఆత్రపడిపోయాను. కాలం కల్సి రాలేదు సుందరం. ఎన్ని సంబంధాలు చూసినా మా ఆవిడ తిరగ్గొడుతోంది. ఎలా చేస్తానో పెళ్ళి." కొంచెం తెలుసున్న ముఖం కనిపిస్తే దీక్షితులు సొంత గొడవలు చెప్పేస్తాడు. అలా చెప్పుకుంటే అదో తృప్తి.

"నా యింటిని గురించి నీకేం తెలుసో, నాకూ అదే తెల్సు. ఎనిమిదేళ్ళయింది అండమాన్ వెళ్ళి, ఇదే రావడం."

రిక్షా ఆగింది పాత పెంకుటింటి ముందు. దాని ప్రహారీ రాత్రే కూలిపోయింది. ఇటుకలన్నీ అడ్డంగా పడి వున్నాయి.

"జాగ్రత్తరోయ్ ... మా ఆవిడ అప్పుడే నాలుగుసార్లు పడింది."

సోమసుందరానికి వరండాలో కుర్చీ వేసి, దీక్షితులు లోపలి కెళ్ళాడు. మాటలు విని సుబ్బులు బయటికి వచ్చింది.

"మా అమ్మాయిరా, గుర్తుపట్టావా?" దీక్షితులు లోపల్నుంచే ఆగి కేకేశాడు.

కామేశ్వరమ్మ వంటషెడ్డులో మండని కుంపటితో అవస్థపడుతోంది. కరెంటు కూడా ఫెయిలయింది. గడపమీద కిరొసిన్ దీపం వుంది.

"సుందరం వచ్చాడేవ్." దీక్షితులు కేకేశాడు.

కామేశ్వరమ్మ ప్రశ్నార్థకంగా చూసింది. తన మొగుడికి స్నేహితం వెర్రి ఎక్కువని, దారేపోయే దానయ్యలను యింటికి తీసుకొస్తూంటాడని ఆమెకి తెలియనిది కాదు.

"సుందరం ఎవరండీ ?" జ్ఞాపకం రాక అడిగింది.

"మనం ఏలూరులో వున్నప్పుడు నీలం డాబాలో వుండే ఆయన. సినిమాలో పనిచేసేవాడు. మనల్ని అస్తమానం సినిమాలకి లాక్కుపోయేవాడు."

కామేశ్వరమ్మకి గుర్తురాలేదు. అయినా

"ఆ ... ఆయనా ... కాఫీ పెట్టనా ?" అంది.

"భోజనమే చేస్తాడు."

తొమ్మిదింటికి భోజనాలయ్యాక స్నేహితులిద్దరూ కబుర్లాడుకుంటూ కూర్చున్నారు.

"సొంతమే కదురా యిల్లు ? బాగుంది చిన్నదయినా ?"

ఇంటిని గురించి ఎవరు పొగిడినా దీక్షితులు పొంగిపోతాడు. "యుద్ధం టైంలో చవగ్గా కొనేశాను. ఇప్పుడు నలభై వేలు పలుకుతోంది."

ఒంటిగంటకి నిద్రకి లేచారు. దీక్షితులు పడుకున్న అరగంటకే సుబ్బులు "నాన్నా సుందరంగారు మూల్గుతున్నారు" అని తండ్రిని లేపింది.

దీక్షితులు కంగారుగా లేచి వెళ్ళాడు. సోమసుందరం మంచంమీద బాధగా దొర్లుతున్నాడు. "సుందరం ... ఏమైందిరా ?" దీక్షితులు దగ్గరి కెళ్ళి అడిగాడు.

సోమసుందరం గుండె నొప్పి అన్నాడు.

దీక్షితులు డాక్టరుకోసం పరుగెత్తాడు.

డాక్టరుతో తిరిగి వస్తూండగా యింటి ముందర సుబ్బులు ఎదురై "ఆయన పోయారు నాన్నా" అని చెప్పింది.

దీక్షితులు కలవరపడిపోయాడు. రాక రాక కల్సుకున్నందుకి అవాంతరమేమిటి ? దీక్షితులు బాధతో నిల్చుండిపోయాడు మాట రాక.

సోమసుందరం కొడుక్కి వైర్ యిచ్చాడు. నాలుగున్నరకి టాక్సీలో శ్యాం వచ్చాడు. తండ్రి శవంమీదపడి ఘొల్లుమన్నాడు.

"బలవంతంగా నేనే ఆపాను నాయనా. లేకపోతే నీ ఒడిలో పోయేవాడు" అన్నాడు దీక్షితులు నొచ్చుకుంటూ.

"ఋణం లేదండీ." శ్యాం నిబ్బరంగా అన్నాడు.

"ఈ రోజు వస్తున్నట్లు మీకు తెలియదా ?" కామేశ్వరమ్మ అడిగింది.

"నాలుగేళ్ళనుంచి ఆయన దగ్గర్నుంచి ఉత్తరాలు లేవండీ. నేను రాసినా సమాధానాలు వ్రాసేవారుకాదు. చివరికిలా చూడవల్సి వచ్చింది."

వెంటనే శ్యాం, శవాన్ని తీసుకుపోయాడు.

మర్నాడు దీక్షితులుకి మెలకువ వచ్చేసరికి పదయింది. రాత్రి జరిగిన సంఘటనలన్నీ కలలాగ కనిపించాయి. ముఖం కడుక్కొని బద్ధకంగా హాల్లో కూర్చున్నాడు. జరిగిన అభావానికి మనసు గంద్రగోళంగా వుంది. సుబ్బులిచ్చిన కాఫీ యాంత్రికంగా త్రాగేశాడు.

"ఈ సంచీ ఎవరిదండీ ?" కామేశ్వరమ్మ నల్లటి ప్లాస్టిక్ జిప్పర్ బీరు

వాలోనుంచి తీస్తూ మొగుడికేసి చూసింది.

"పట్రా ... నిన్న సుందరంగాడు దాచమని యిచ్చాడు.

దీక్షితులు జిప్ తీసి చూశాడు. నోట్ల కట్టలు జిగేల్ మన్నాయి. లెక్క పెట్టాడు. యిరవై వేలున్నాయి. ఆశ్చ ర్యంతో నోట మాట రాలేదు. జీవితంలో ఎన్నడూ అనుభవంలోకి రాని విషయం ఎదురయినప్పుడు కలిగే మైకంలో మునిగిపోయాడు.

"ఋణంలేని మనిషి." కామేశ్వరమ్మ వ్యాఖ్యానం చేసింది.

దీక్షితులు లేచి బట్టలు వేసు కున్నాడు.

"ఎక్కడికి ?" కామేశ్వరమ్మ అడిగింది.

"శ్యాం కిచ్చి వస్తాను."

కామేశ్వరమ్మ వడిగా ముందుకు వచ్చింది. సంచీ తీసి బీరువాలో పెట్టి తాళంవేసింది. "ఏదో సత్తెకాలపు సత్తెయ్యలా మాట్లాడతారేమిటి ? సోమ సుందరం డబ్బు తెస్తున్నట్లు శ్యాంకి తెలియదు. ఏళ్ళతరబడి ఉత్తరాలే లేవు. ఏదో అదృష్టం బాగుండి మనిం టికి వచ్చాడు."

దీక్షితులు గడ్డం రాసుకుంటూ భయంగా కుర్చీలో కూర్చుండిపోయాడు. డబ్బుకోసం సాహసాలు, దుర్మార్గాలు చేసిన కథలు విన్నాడు. ఒక రకంగా పైకి పోవడానికి అలాంటి సంఘటనల కోసం దీక్షితులు అప్పుడప్పుడు ఎదురు చూశాడు. గుమస్తాగా పై సంపాదన అలవాటు వున్న మనిషయినా యింత డబ్బు చూడగానే కంగారు పుట్టింది. భార్య చెప్పిన మాటలు అర్థమయినాయి. నిర్ణయానికి వచ్చే బాధ్యత తనకి లేనట్లు "ఏంచేద్దాం" అన్నాడు.

"సంచీ మనింట్లోనే వుంటుంది."

"శ్యాంకి తెలిస్తే?"

"ఎలా తెలుస్తుంది ?"


"తెలిసిందే అనుకో?"

"సంచీ మన కిచ్చినట్లు ఆధారం ఏదైనా వుందా ? ఏమో... ఏంచేశాడో ఆ సంగతి మాకు తెలియదని చెప్పడమే."

దీంతో దీక్షితులుకి బలం వచ్చింది. ధైర్యం వచ్చింది. సోమసుందరానికి కృతజ్ఞత చెప్పుకున్నాడు, "ఒక్కపూట ఆతిధ్యాని కింత సంపద యిస్తావా" అంటూ.

రెండు వారాలపాటు దీక్షితులు బెరుకుగానే గడిపాడు, శ్యాం దగ్గర్నుంచి ఏదయినా ఉత్తరం వస్తుందేమోనని. అతడనుకున్నట్లు జరగలేదు. ఇరవై వేలమీద యిక అధికారి తానేనని నిర్ణ యానికి వచ్చాడు.

ఇప్పుడు సుబ్బులు పెళ్ళి సమస్యగా కనిపించడంలేదు. దానికోసం యిల్లు




అమ్మకక్కర్లేదు. రాజాలాంటి సంబంధం చెయ్యొచ్చు.

తమకంటే పై సంబంధాలకోసం దీక్షితులు వేటాడుతున్నాడు.

* * *

సుబ్బులు పెళ్ళివిషయంలో భర్త కన్న తనకే ఎక్కువ బాధ్యత వుందని కామేశ్వరమ్మ గ్రహించింది. లౌకిక వ్యవహారాల్లో దీక్షితులు కంత నేర్పు లేదని ఆమె భావన. పైగా చిన్నప్పట్నుంచీ తనకో వ్యక్తిత్వం వుందని కామేశ్వరమ్మ రుజువుచేసుకుంటూ వస్తోంది. కుటుంబంలో తను ప్రేక్షకురాలు కాదని, నిర్మాణాత్మక వ్యవహారాల్లో తనకీ భాగముందని, ఒకవిధంగా తుదితీర్పు తనదే నన్నట్లు కామేశ్వరమ్మ ప్రవర్తించడం తొలిరోజుల్లో దీక్షితులు విసుక్కున్నా రాను రాను అలవాటుపడిపోయాడు. అతడూ ఆమె తెలివితేటల్ని ఆరాధించడం నేర్చుకున్నాడు.

మేనకోడలు పెళ్ళికి నెలరోజుల నుంచీ కామేశ్వరమ్మ సిద్ధపడుతూనే వుంది. పెళ్ళికి వెళితే సంబంధాల భోగట్టా తెలుస్తుందని ఆమె ఆలోచన. శుభలేఖలు వచ్చేసరికి కీళ్ళవాతంతో మంచం ఎక్కింది.

"రాజమండ్రి నేను పోయివస్తాను." దీక్షితులు ప్రయాణమయ్యాడు.

"మీరు వెళితే మందూ, మాకూ ఎవరు తెస్తారు?"

"మరి ?"

"సుబ్బుల్ని పంపించండి. వైరిస్తే మా అన్నయ్య స్టేషన్‌కి వస్తాడు. నాలుగురోజు లుండివస్తుంది."

పెళ్ళి విషయాలన్నీ జాగ్రత్తగా తను

చూచినట్లు చెబుతుందని కూతుర్ని పంప డానికి నిర్ణయించుకుంది. దీక్షితులయితే కట్టె—కొట్టె—తెచ్చే నన్నట్లు చెబుతాడు. పనికొచ్చే విషయాలకంటే పనికిరానివే చెబుతాడు.

సుబ్బులకి ప్రయాణాలంటే యిష్టం. అందులోను యిది పెళ్ళి ప్రయాణం. పావని, వర్ధని తన యీడువాళ్లే. సరదాగా గడపొచ్చు.

"డబ్బు మాట ఎవరికీ చెప్పకుస్మీ," హెచ్చరించింది.

"నీ అనుమానం మండ. అదేమన్నా చిన్నపిల్లటే."

"మీదీ ... అమ్మాయిదీ ఒక్కటే తెలివి..."

పెళ్ళి రేపనగా వెళ్ళింది సుబ్బులు. అప్పటికే చుట్టాలతో రష్‌గా వుంది యిల్లు. వేసంకాలం కానుక. చాలమంది పందిర్లలోనే కాలక్షేపం చేస్తున్నారు. పెళ్ళివారికి స్వాగతం చెప్పడానికి తనూ స్టేషన్‌కి వెళ్ళింది. బండి గంట లేటు.

మగపెళ్ళివారిలో శ్యాంని చూసి నిర్ఘాంతపోయింది. కాదేమోనని ముందర సందేహపడింది. "శ్యాంనండీ" చొరవగా అతడే దగ్గరికి వచ్చాడు.

సుబ్బులు సిగ్గుతో నవ్వింది.

"ఇలావచ్చాననినిర్ఘాంతపోతున్నారు. అవునా ? పెకొ నా ఫ్రెండ్. రాక తప్ప లేదు. మీరు పెకూ తరఫున వచ్చారన్న మాట—స్నేహితమా ? చుట్టరికమా ?"

సుబ్బులు నవ్వకుండా వుండలేక పోయింది.

రిక్షాలమీద వచ్చినవారు ఎక్కేశారు. సుబ్బులు, శ్యాం మిగిలిపోయారు. ఇక రిక్షాలుకూడ లేవు.

"నాలుగడుగులు వేద్దాం నడవండి. సాయంత్రాలు సిటీలో హాయిగా నడవచ్చు."

సుబ్బులు సరేనంది.

"కాస్త కాఫీ త్రాగి పోదాం... పెళ్ళివారి ఆతిధ్యం ఎలా వుంటుందో తెలియదు కదా!"

"బ్రూ రెడీగా వుంది."

"అయినా మందిమీద ఏం బాగుంటుంది లెండి."

శ్యాం అప్సరాలోకి దారితీశాడు. రిఫ్రెష్‌మెంట్సు ఆర్డరిచ్చి "ఏదో వీక్లీ కొన్నారే !" అంటూ పుచ్చుకున్నాడు.

"రెండుగంటలు స్టేషన్‌లో ఏం చెయ్యం చెప్పండి ?"

'పెళ్ళి జరిగింది' కథ చదివారా ?" టిఫిన్‌చేస్తూ అడిగాడు శ్యాం.

"ఆ. బాగుంది చాలా."

"నేనే రాశాను."

"అలాగా...మీరు కథలు రాస్తారన్న మాట ?"

"అదో వ్యసనమైపోయింది. నేను రాసినవి ఎవరికీ నచ్చవు. సంపాదకులు

తిప్పేస్తారు. ఖర్మం జాలక వేస్తే పాఠకులు బోర్ అంటారు."

"ఈ కథ మాత్రం నాకు బాగా నచ్చింది."

ధనంజయ మిల్లులో గుమస్తా. నలుగు రాడపిల్లలు. పెళ్ళికి సాయం చెయ్యమని యజమాన్ని అడుగుతాడు. యజమాని వాయిదా వేస్తూంటాడు. ఓసారి రెండొందల బియ్యం బస్తాలు కర్ణాటకకి దొంగతనంగా అమ్మించడానికి లారీ లోడ్ చేస్తాడు. కూడా ధనుంజయని వెళ్ళమంటాడు. ధనుంజయ వాటిని దారిలో అమ్మేసి, లూటీ చేశారని చెబుతాడు. ఉద్యోగం పోతుంది. అందరికీ పెళ్ళి చేసేస్తాడు.

"మంచిగా చెయ్యలేని పని చెడ్డగా చేశాడు ధనుంజయ. నా స్నేహితులకిది నచ్చలేదు. 'దుర్మార్గం చేసి సంపాదించాడు' అన్నారు.''

"అతడు మంచిగా వుంటే పెళ్ళిళ్ళు చేసేవాడు కాదు. చెడ్డద్వారా కుటుంబాన్ని బాగుచేసుకున్నాడు. అవకాశాన్ని వినియోగించుకున్నాడు."

"వాస్తవంలో అటువంటి మనుషులుంటారుటండీ ?"

"ఎందుకుండరు ?"

శ్యాం విజయగర్వంతో చూశాడు.

* * *

''ఇదిగో ... ఏదో వుత్తరం వచ్చింది,'' యిన్‌లాండ్ కవరువిప్పతూ భర్త దగ్గర కొచ్చింది కామేశ్వరమ్మ.

దీక్షితులు సీరియస్‌గా రాస్తున్నాడు. సమాధానం చెప్పలేదు.

"ఆ కొంటె రాతలకేం లెండి... ఉత్తరం చూడండి." కామేశ్వరమ్మకి జోడు లేకపోతే సరిగ్గా కనపడదు. కళ్ళజోడు వెతికి తాను చదివే శ్రమలేకుండా అందుబాటులో వున్న భర్తకి పురమాయించింది.

దీక్షితులు విసుగ్గా చూశాడు. అతడు రిటైరయిపోయినప్పట్నుంచి వ్యాసాలు రాయడం అలవాటు చేసుకున్నాడు. దీనివల్ల తెలుగు సాహిత్యానికేదో మేలు చేస్తున్నాడన్న భావం దీక్షితులకి లేదు. కేవలం కాలక్షేపానికే రాస్తున్నాడు.

''ఏముంది ... బెంగుళూరు వాళ్ళు అమ్మాయి ఫొటో పంపించమన్నారు.''

"ఫొటో ఓసారి, మనిషిని ఓసారి నేమిటి చూడటం ?" సుబ్బులు పెళ్ళి తొందరలో అయిపోవాలని ఆమె ఏంతో కంగారు పడుతోందో అంత ఆలస్యమూ జరుగుతోంది.

"బాగుందేవ్ ... ఇంట్లో విషయమాయిది కొట్టి పడెయ్యడానికి. పోనీ ఓ ఫొటో పంపుదాం."

కామేశ్వరమ్మ సణుగుతూ లోపల కెళ్ళిపోయింది. వంటింటిలో సుబ్బులు తీరిగ్గా కూర్చుని కాఫీ త్రాగుతున్నది.

''అమ్మాయ్... నీ ఫొటో వుందా?''

''లేదు.''

తల్లి చెప్పగానే సుబ్బులు మూలు క్కుంది. ''నే వెళ్ళను బాబూ'' అంది చిరాగ్గా. కామేశ్వరమ్మలోని అహం సుబ్బులుకీ వచ్చింది. ఎవరో తనని చూడటం, వారికి నచ్చడం, అప్పుడు పెళ్ళి జరగడం యిదంతా ఆమెకి అవమానంగా వుంది.

''నే నెంత హాయిరానా పడుతున్నా మీ తండ్రీకూతుళ్ళకి పట్టడం లేదే మిటే ? ఇదంతా నా కోసమా ?"

"ఫొటో చూస్తే ఏం తెలుస్తుంది ?"

''అదంతా నీ కెందుకే. స్టూడియోకి వెళ్ళిరా. ఎగ్జిబిషన్‌కి వెళతా నంటు న్నావుగా ..." కామేశ్వరమ్మ ఎర పెట్టింది.

లంచానికి లొంగని దేముంది ?

ఎగ్జిబిషన్‌లో శ్యాం కనిపించాడు.

''హలో ... హఠాత్తుగా కలు్సు కుంటున్నాం."

సుబ్బులు సమాధానంగా నవ్వింది. ''ఎగ్జిబిషన్‌కి వచ్చారా ?''

''నిజం చెప్పమంటారా ?"

''మీ యిష్టం."

''అసలు మా మామయ్యతో పెళ్ళి చూపులకి వచ్చాను. పిల్ల నచ్చలేదు. ఎగ్జిబిషనయినా చూద్దామని వచ్చాను."

శ్యాం కూల్‌డ్రింక్ షాపులోకి దారి తీశాడు. కోక్ ఆర్డరిచ్చాడు.

''అమ్మగారూ, నాన్నగారూ బాగు న్నారా ?''

సుబ్బులు తలూపింది.

''వద్దామా అనుకున్నాను. దురదృష్ట మయిన ఆ రోజు జ్ఞాపకం వస్తుంది. మీ నాన్నగారు ఆ రోజు నాకోసం చాల శ్రమ తీసుకున్నారు. అందుకు ఆయన్ని అభినందించాలి.''

ఆ మంచితనం సుబ్బులు భరించ లేకపోయింది. కూల్‌డ్రింక్‌కి నోరు జివ్వుమన్నట్లు మనసు రెపరెపలాడింది. తనవాళ్ళు కసాయివాళ్ళలా ప్రవర్తిం చారు. డబ్బు దగ్గర విలువల్ని చంపేసు కున్నారు. అటువంటివాళ్ళని శ్యాం మహాత్ములంటున్నాడు.

''పిచ్చి గీతల్లా వుంటున్నాయండీ రోజులు. ఏడెనిమిదేళ్ళనుంచి చదువు కుంటూనే వ్యవసాయం చూస్తున్నాను. సొసైటీ గొడవలవల్ల మా నాన్నగారు అండమాన్ వెళ్ళిపోయారు. అప్ప ట్నుంచీ కుటుంబభారం నామీద పడింది. కుటుంబమంటే మా అక్క, నేను. పెళ్ళయి రెండేళ్ళయింది అక్కకి. ఫారెన్ వెళ్లేముందే మామయ్య నన్నో యింటివాడు కమ్మంటున్నాడు.

మీకు అప్సరస కావాలేమో."

శ్యాం సమాధానం చెప్పలేదు. బిల్లు చెల్లించి బయటకి వచ్చారు. ఎనిమి దిన్నరయింది. సిటీ బస్‌కోసం స్టాప్‌లో నిలబడ్డారు.

"ఇందాక మీరన్నారు చూడండి ... అప్సరస కావాలని, నా కంత అత్యాస లేదు లెండి. అర్థంచేసుకునే మనిష యితే చాలు...మీలాగ."

ఆ చొరవకి సుబ్బులు విస్తుపోయింది. సిగ్గుపడింది, ఏంమాట్లాడ డానికి తోచలేదు. ఏం చెప్పడం శ్యాంకి.

"మీ కిష్టమయితే మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను."

సుబ్బులు ఎన్నో వందల ప్రేమ కథలు చదివింది. ప్రేమ స్వానుభవం లోకి వస్తుందని ఆమెకి నమ్మకం లేదు. అందం సామాన్యం, ఆకర్షణసామాన్యం. చామనఛాయగా పొడుగ్గా వుంటుంది. చదువు కూడ సామాన్యమే. అందుకే ఎన్నో సంబంధాలు తిరిగిపోయాయి.

పై అంతస్థులో వున్న శ్యాం తనని కోరి చేసుకోవడమా ?

"తొందరలేదు ... ఆలోచించి ఉత్తరం రాయండి. తర్వాత మామయ్య వస్తాడు. వివరాలు మాట్లాడుకోవచ్చు." అడ్రస్ యిచ్చాడు.

సిటీ బస్ రష్‌గా వచ్చింది. ఎక్కడం సాధ్యంగాలేదు.

"రిక్షాలో వెళదాం ..." శ్యాం రిక్షా పిలిచాడు. సుబ్బులు అభ్యంతరం చెప్ప లేదు. తనకి వరించబోయే అదృష్టానికి ఆమెకి థ్రిల్లింగ్‌గా వుంది.

"పెళ్ళి విషయంలో మీకు స్వాతంత్ర్యం వుందనే భావిస్తాను. మీరు తొందరగా నిర్ణయాన్ని చెబితే సంతోషిస్తాను."

"నా కిష్టమే." వేలు కొరుకుతూ సిగ్గుగా అంది.

"థాంక్యూ."

* * *

సుబ్బులు ఆ రాత్రికంటే ఈ వార్తని తనలో దాచుకోలేకపోయింది. ఆనందంతో రాత్రి ఉక్కిరిబిక్కిరయిపోయింది. రంగు రంగుల కలలు. శ్యాంతో ఫారెన్ టూరు. భవితవ్యం ముత్యాల ముగ్గులా కనిపిస్తోంది.

తెల్లవారగానే తల్లితో చెప్పేసింది.

శ్యాం ! సోమసుందరం కొడుకు. కామేశ్వరమ్మకి కాదనాలనిపించింది. అనలేకపోయింది. ఏం తక్కువని కాదనడం ? బంగారంలాంటి సంబంధం. తప్పు చేశామన్న భావం కల్గడంతో అంతరాత్మ ఒప్పుకోవటంలేదు.

"మిమ్మల్నే......భర్తని కేకేస్తూ నడిచింది.

దీక్షితులు నవారు మంచం బిగిస్తున్నాడు. అతడికి ఖాళీగా వుంటే తోచదు. నిత్యం ఏదో పని చెయ్యవల్సిందే.

"మంచి సంబంధమే ..." నసుగుతూ అన్నాడు. భార్య నిర్ణయం వినకుండా వ్యాఖ్యానించడానికి మన సొప్పలేదు.

"అంత పెద్ద సంబంధం తూగ గలమా ?"

సుబ్బులు కాఫీ త్రాగుతూ గుమ్మం దాకా వచ్చింది. తల్లీ, తండ్రీ ఏం మాట్లాడుకుంటారో వినాలని ఆ పిల్ల కుంది.

కాని మంత్రించినట్లు వారు మరి మాట్లాడుకోలేదు. ఇద్దరి మనస్సుల్లోను గొప్ప అలజడి దాగుంది.

వంటచేస్తూ కామేశ్వరమ్మ ఆలో చిస్తూనే వుంది. ఏదో తొందరపడి తప్పు చేశారు. ఆ పాపం యిలా తీరి పోతుంది. కామేశ్వరమ్మ సమాధాన పడింది.

దీక్షితులు వుత్తరం రాసి పడేశాడు.

పదిరోజులు తర్వాత శ్యాం, మేన మామ శిరోమణి వచ్చారు. పెళ్ళి చూపుల తతంగం లాంఛనంగా ముగిసింది.

దీక్షితులు, శిరోమణి వ్యవహారంలోకి దిగారు.

"కట్న కానుకలు చెబితే..." దీక్షి తులు ఆగిపోయాడు.

శిరోమణి చుట్ట వెలిగించి, "మా బావగారికి, మీకు వున్న స్నేహానికి ఈ సంబంధం కలవడం చాల బాగుంది. ఆయనే వుంటే ఎంత సంతోషించేవాడో. దేనికీ ప్రాప్తంలేని మనిషి" అన్నాడు గంభీరతగా.

"వెన్నలాంటి మనిషి." దీక్షితులు స్నేహితుణ్ని మెచ్చుకున్నాడు.

"మా శ్యాంగాడికి గోపన్నపాలెంలో ఎనిమి దెకరాల పొలం వుంది. ఏలూ రులో రెండు డాబా లున్నాయి. రేపో మాపో ఫారెన్ వుద్యోగంలో చేరబో తున్నాడు. లక్షరూపాయిలు యిస్తామని వస్తున్నారు. మీరు కావల్సినవారు కనుక యాభై యిస్తే చాలు. ముహూర్తాలు పెట్టుకుందాం."

"మేం తూగలేం అన్నగారూ."

ఇద్దరి జీవితాలు ముడిపెట్టేటందుకు మూడోరకం వ్యక్తులు అచ్చమైన వ్యాపార శైలిలో మాట్లాడుకోసాగేరు. కామేశ్వరమ్మ జోక్యం చేసుకోపోయినా సంభాషణ వింటోంది.


నాకే ఆడపిల్లవుంటే కళ్ళుమూసు కుని యిచ్చేవాడ్నన్నాడు శిరోమణి. సంబంధం కలుపుకునే ధోరణి మీకు లేదన్నాడు. ఇంత చవగ్గా ఏ మంచి సంబంధమూ రాదన్నాడు.

"చివరి మాటగా యిరవై వేలు. నచ్చితే ఉత్తరం రాయండి." శిరోమణి లేచాడు.

వాళ్ళని పంపేదాకా దీక్షితులు, కామేశ్వరమ్మా చిన్న పెద్దా సమావేశాలు పెళ్ళి గురించి చాలా జరిపారు. సంబంధం బాగుంది. కానీ కట్నం ఎక్కువ. సంపాదించినదంతా పెళ్ళికే



యువ




ఖర్చుపెట్టడానికి మనస్సు ఒప్పడం లేదు.

"మనం తూగలేం ... ఉత్తరం రాసేస్తా కామూ" అన్నాడు తెగించి.

కామేశ్వరమ్మ యింకా ద్వంద్వంలో వుంది. డబ్బు గురించి యింకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నది.

వీరి ప్రవర్తన సుబ్బులకి కంగారుగా వుంటోంది, శ్యాం సంబంధం ఎక్కడ కాదంటారనో. శ్యాం ఆకర్షణలో ఆమె పడిపోయింది. డబ్బు, చదువు వున్న వాడు. పైగా రచయిత. తనలాంటి దాన్ని కోరిచేసుకోవడమే విడ్డూరం. నాన్నా, అమ్మా యింకా మీనమేషాలు లెక్కపెడతారేమిటి ? అతని డబ్బే అతని కిస్తున్నారు. అంటే తమ డబ్బు కట్నం లేకుండా చేసుకుంటున్నాడు మాట. ఇదివరకు పదివేల కట్నానికి ప్రయత్నించలేదూ ?"

"శ్యాంనే చేసుకుంటాను." సుబ్బులు తన నిర్ణయం తెలియచేసింది.

ఇక తాను ఓ నిర్ణయానికి వచ్చే సమయం ఆసన్నమైనదని కామేశ్వరమ్మ గ్రహించింది. సుబ్బులుకి ఆమె చూసే సంబంధాల్లో ముఖ్యంగా కామేశ్వరమ్మ కోరుకునేది వరుడుకి ఎవరూ దక్షత లేకపోవడం. కామేశ్వరమ్మ కీ సంబంధంలో ఆ వీలు చక్కగా కనిపిస్తోంది. భవిష్యత్తులో సుబ్బులే తమకి దిక్కు కనుక ఆమె యింట చొరవ, అధికారమూ ఉంటుంది.

"మీరు వాళ్ళపరిస్థితి చూసి, తాంబూలాలకి రమ్మని చెప్పండి. ఏదోలా చేసెయ్యాలి పెళ్ళి. ఇప్పటికే ఆలస్యమైంది."

దీక్షితులు వెళ్ళాడు.

శ్యాం, శిరోమణి నెత్తిన పెట్టుకున్నారు. రాచమర్యాదలు జరిగినాయి,

వారి ఠీవి, హోదా దీక్షితుల్ని ముగ్ధుడ్ని చేసింది.

''మన సుబ్బులదే అదృష్టమంటే... పాడీ, పంటా ..." దీక్షితులు తను చూసింది తన్మయత్వంగా చెప్పాడు.

ఇదంతా తన ప్రతాపమే నన్నట్లు గర్వించింది కామేశ్వరమ్మ.

''వాళ్ళు శనివారం వస్తామన్నారు.''

కామేశ్వరమ్మ ఆ ఏర్పాట్లలోకి దిగింది. ఓ రోజు హఠాత్తుగా ఓ విషయం స్ఫురించింది. వెంటనే సుబ్బుల్ని కేక వేసింది.

''డబ్బు విషయం చెప్పకుస్మీ.''

''చెప్తానా ?"

''నామీద ఒట్టేసుమా !"

సుబ్బులు మందహాసం చేసింది.

* * *

ఆ రోజు దీక్షితుల పేర రిజిష్టరు కవరు వచ్చింది.

''దీక్షితులుగారికి,

లగ్నపత్రికకోసం ఎదురు చూసే మీకు ఈ వుత్తరం ఆశ్చర్యంగానే వుంటుంది. కాని నా నాటకం విజయవంతంగా ముగిసింది. మా నాన్న డబ్బుతో వస్తున్నట్లు ముందే నాకుత్తరం రాశారు. ఆయన చనిపోవడంతో డబ్బు ఏమైందో తెలియలేదు. మిమ్మల్ని అడిగినా ఏంలాభం ? రాజమండ్రి పెళ్ళిలో సుబ్బులు కనిపించింది.

వారపత్రికలోని కథపై (అది నేను రాయలేదు) అభిప్రాయం అడిగాను. ఆమె మాటమీద మీరే సొమ్ము కాజేసారని భావించాను. తర్వాత సుబ్బుల్ని పెళ్ళికి అంగీకరింపజేశాను. నా ఆకర్షణలో కన్నెపిల్ల పడిపోయింది.

కట్నంద్వారా మా సొమ్ము అందినది. ఇంత సాయంచేసిన సుబ్బులుకి కృతజ్ఞతలు చెప్పుకోవాలి

నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. మామయ్యగా వచ్చిన శిరోమణి నా మామగారు. ఏ గొడవలేకుండా నా డబ్బు మీ వద్దనుంచి అందుకున్నాను.

డబ్బు దగ్గర కక్కుర్తిపడి మిత్రద్రోహంచెయ్యడం చాల నీచమైన పని. అంతరాత్మ వుంటే పశ్చాత్తాప పడకపోరు. మా నాన్న ఉత్తరం రాసినట్లు నేను చెప్పకపోవడంవల్ల మీరీ సాహసం చేసి విఫలులయ్యారు.

లేనిపోని ఆశలు కల్పించినందుకు సుబ్బులు క్షమించదేమో !

సెలవా మరి !

శ్యాం"

కామేశ్వరమ్మకి, దీక్షితులకి పగలే చీకటయింది. పంటకోసిన చేలల్లా ముఖాలు వెలవెలపోయాయి. చలి పిడుగులా వుంది ఉత్తరం.

''ఏం జరిగింది ?'' సుబ్బులు అప్పుడే వచ్చి అడిగింది.

ఇద్దరూ కూతురుకేసి నిప్పులు రాల్చేలా చూశారు.